# పడిలేచిన కెరటం



## - గంటి భానుమతి

*(గత సంచిక తరువాయి)*

**"అంతసేపు చదవకు.** కళ్ళు పాడవుతాయి. పది గంటలకి లైట్లార్పెయ్యాలి. పొద్దున్న తొందరగా లేవచ్చు. ఆ సమయంలో చదినది బాగా గుర్తుంటాయి "

మళ్ళీ నేనేం చెయ్యాలో వాళ్ళే నిర్ణయించేసారు. అసంతృప్తి. ప్రతీ దాన్లో కలగ చేసుకుంటారెందుకో నా కర్థం కాలేదు. అమ్మ మీద కోపం వచ్చింది. ఆ కోపంలో ఇంకా రాసాను. ఏదో ఆవేశం, ఎన్నో రాయాలని ఆశ. అలా రాసెస్తున్నాను. నిద్ర కూడా పోకుండా రాసెస్తున్నాను. నేను నిద్ర పోవడం లేదని కూడా నాకు తెలీడం లేదు.

ఆ ఊపులోనే సువర్ణకి ఓ పెద్ద ఉత్తరం రాసాను. అది పెద్దదని అనుకోలేదు. మనసులో ఉన్నది రాసేసాను. అందులో మొదటి సారి మా ఫోన్ నంబరు కూడా ఇచ్చాను. దానికి అది వెంటనే ఫోను చేసింది.

"అది ఉత్తరంలా లేదు. మంచి ఎక్స్ ప్రెషన్ తో ఉన్నఓ వ్యాసం , నీ మనసులోంచి వచ్చిన రచన అది. దానికే కొంచెం మొదలూ చివర సరిగా ఓ ఆకారం ఇచ్చి రాస్తే ఓ కథ అవుతుంది. ఎంత బాగా రాసావో. మంచి వ్యక్తీకరణ . ఇదే ఇలాగే కొనసాగిస్తే నువ్వో మంచి రచయిత్రివి అవుతావు. రాయడం ఆపెయ్యకు. వీలున్నప్పుడు రాస్తూండు. మీ కాలేజీలు ఎప్పుడూ తెరుస్తారు. నావి తెరిచేసారు. ఇప్పుడు ఓ ఇద్దరు కొత్తగా చేరారు మన గ్రూపులోనే ఉన్నారు, పర్వాలేదు వాళ్ళు కూడా మనలాంటి వాళ్ళే. లైక్ మైండెడ్ "

సువర్ణ ఉత్తరం చదివాక నేనో రచయిత్రిని అయిపోవాలని నిశ్చయించుకున్నాను. ఈ బీఎస్సీ,ఈ ఎంసెట్ కాలేజీ. అన్నింటినీ ఓ మూలకి తోసెయ్యాలనిపించింది. కానీ పూర్తిగా అలా చెయ్యలేక పోయాను. చదవడం రాయడం ఇదే నా వ్యాపకం అయింది. రెండు డైరీలు నిండి పోయాయి. అంతలో కాలేజీలు తెరిచారు.

నేను కాలేజీలో చేరాను. రాగింగ్ అంటూ కొంత చేసారు. నేనో వేస్ట్ కాండిడేట్ ని నాకు నేనే నిర్ణయించేసుకున్నాను. ఏమాత్రం స్పందన లేని దానిగా తయారయ్యాను. అందుకే వాళ్ళు ఏం చెయ్యమంటే అదే ఓ బొమ్మలా చేసాను . ఎక్కడా ప్రతిఘటించ లేదు. ఎందుకో తెలీదు. ఆర్నవ్ మరణం మూలంగా కావచ్చు , నాకు మెడిసిన్ లో సీటు రాలేదని కావచ్చు. ఎప్పుడూ చదువూ చదువూ అని విసిగిస్తున్న నాన్న,అమ్మా మూలంగా కావచ్చు. అన్నీ కలిపి నన్నుఓ స్పర్శ లేని దానిగా చేయడం వలన కావచ్చు. నాలో అంతకంతకూ పెరుగుతున్న నిరాసక్తత కావచ్చు.

ఏదైనా వాళ్ల రాగింగ్ నన్నేంచేయ లేకపోయింది. అయితే ఆ తరవాత చాలా మంది నా ఫ్రెండ్స్ అయిపోయారు. వాళ్ళందరి కన్నా అందంగా ఉంటానని పబ్లిక్ గా ఒప్పేసుకున్నారు. ముఖ్యంగా ప్రద్యుమ్న,అతను నార్త్ ఇండియన్ ,హైదరాబాదు పాత సిటీలో పుట్టి పెరిగిన

వాడు. అందుకని సహజంగానే ఉర్దూ ప్రభావం అతని మాటల్లో కనిపిస్తూంటూంది. అంతే కాకుండా ప్రద్యుమ్న కి  సాహిత్యం అంటే ఇష్టం. తను రాయడు కాని ఉర్దూ కవితలని ఆశువుగా చెప్తాడు. హిందీ పాటల గురించి ,ముఖ్యంగా సాహిర్ లుధియాన్వీ పాటలు పాడి, దాని అర్థం చెప్పేవాడు. పుస్తకాలు బాగా చదువుతాడు. ఈ పుస్తకం బావుంది అంటూ ఆ పుస్తకం గురించి టూకీగా చెప్తాడు. నాకు హిందీ పెద్దగా రాదు, నా  హిందీ, ఉర్దూ భాషలని ప్రద్యుమ్న వలనే కాస్త ఇంప్రూవ్ చేసుకున్నాను. మంచి మంచి పాటలు పాడేవాడు. ఉర్దూ పాటలు గజల్స్ ఎక్కువగా పాడేవాడు. దాని అర్థం చెప్పే వాడు. మాట్లాడుతున్న ప్రతీసారీ నా మొహంలోకి సూటిగా చూస్తూండే వాడు. ఒక్కొక్క సారి నాకు ఇబ్బందిగా అనిపించేది. కలవరపడి చూపులు తిప్పేసుకునే దాన్ని.

ప్రద్యుమ్న నన్ను ఆకర్షిస్తున్నాడనిపించింది. మళ్ళీ ఆకర్షణ, ఇష్టం.ఇది మూడో సారి. వంశీ, ఆర్ణవ్, ఇప్పుడు ప్రద్యుమ్న. ఇప్పుడు కూడా స్నేహం మాత్రమే. నేను ఆ మాటని ముందే ప్రద్యుమ్న కి చెప్పాను. ముందుకి వెళ్ళకుండా నేను కూడా జాగ్రత్త పడుతున్నాను “

శృతి ఆపి మానవ్ వైపు చూసింది. అతను ఆమెనే చూస్తున్నాడు.

“ నేను ఏదైనా వేసుకొస్తాను “  అంటూ తన ప్లేటు తీసుకుని వెళ్ళింది.

మానవ్ ఆమె వెళ్ళిన వైపే చూస్తూ ఆలోచనలో పడ్డాడు. శృతి ఇంత వరకూ చెప్పినది తన జీవితమా లేకపోతే కల్పించిన కథా.హృదయం మూగపోయిన జీవితం. విధి నడిపిస్తేనే తప్ప గతిలేని  నడక  అయింది జీవితం. ఆమె అనుభవించిన మానసిక సంఘర్షణ గురించి ఆలోచిస్తున్నాడు.  తన ప్లేటు కూడా ఖాళీ అయిందని లేచి వెళ్ళి నింపుకుని వచ్చాడు .

“ ఇప్పుడు చెప్పండి.”  కూచున్నాక అన్నాడు..

ఓసారి మానవ్ మొహంచూసి,చెప్పడానికి తయారైంది.

“ చాలా రోజుల తరవాత అద్దంలో నా మొహం చూసుకున్నాను. అది నేనేనా. నాకే అనుమానం వచ్చింది. కాని అది నేనే. అద్దం అబద్ధం చెప్పదు. ఇది నేను. ఈ హైద్రాబాదు వచ్చాకా నాలో మార్పు వచ్చింది. ఇదివరకు ఎంతో అందంగా ఉండేదాన్ని. స్కూల్లో, జూనియర్ కాలేజీలో అందరి మధ్య నేను ఓ స్పెషల్ గా కనిపించేదాన్ని. ఇంటర్ లో డిగ్రీ లో కాలేజి బ్యూటి అని అనేవారు. ఇప్పుడూ అదే అందం. కానీ ఏదో లోటు. ఏదో లోపం. ఆ పలచటి లేత చర్మం , మెరుపు అన్నీ పోయాయి. ఆర్నవ్ మరణం, మెడిసిన్ లో సీటు రాక పోవడం,ఇంట్లో వాళ్ళ పోరు. నిద్ర లేకపోవడం,ఎంసెట్ కోసం అతిగా చదవడం, అన్నీ కలిపి నా మొహాన్ని మార్చేయి. అది నా పాత మొహం కాకపోయినా అది నేనే. ఈ రెండు నెలలూ ఇంట్లోనే ఉండడం వల్ల మొహం ఉబ్బినట్లుగా అయింది. అమ్మ కూడా అదే అంది.

“ అలా వాకింగ్ కి వెళ్ళి రాకూడదా. మైండ్ ప్రశాంతంగా ఉంటుంది. వాకింగ్ నుంచి వచ్చాకా చదువుకో ఫ్రెష్ గా ఉంటావు.”

మళ్ళీ నా చదువు సంగతి. నేనేం చెయ్యాలో అమ్మ నిర్ణయించేసింది.

అంతే అలారం పెట్టింది. బద్ధకంగా లేచాను తయారయి మా ఆవరణ లోనే వాకింగ్ చేయడానికి వెళ్ళాను. వాకింగ్  నుంచి వచ్చాకా నిజంగానే బావుంది. ఫైనలియర్ క్లాసు పుస్తకాలు,టెస్ట్ లు.రికార్డులు ప్రాక్టికల్స్ ,మరోసారి ఎంసెట్  ప్రిపరేషన్.  అన్నీ టైం ప్రకారంగా వెళ్తున్నాయి. ఈ ఉత్సాహంలో నిద్రని పట్టించుకోడంలేదు. అసలు దానికి మొదట్లో ప్రాముఖ్యం కూడా ఇవ్వ లేదు. కానీ తరవాత

నిద్ర పోదామని ఉన్నా నిద్ర రావడం లేదు. శరీరంలోని గడియారం ఇదివరకు లాగా పని చేయడం లేదు. నిశాచరిలా గదిలో అటూ ఇటూ తిరుగుతూ రాస్తూ ,చదువుతూ ,గడిపేస్తున్నాను

మంచం మీద పడుకుని,బలవంతంగా కళ్ళు మూసుకున్నా,నిద్ర రావడం లేదు. ఎక్కడో ఓ మూల నుంచి ఆర్ణవ్ పైకొచ్చేవాడు. నా మూలంగా పోయాడని దుఃఖం, దానితో భయం. ఆ వెంటనే ఏడుపొచ్చేసేది. ఒక్కొక్క సారి గట్టిగా ఏడ్చేసే దాన్ని. ఎందుకో నాకే తెలీదు. నిద్ర కోసం ఎన్ని చేయాలో అన్ని చేస్తున్నాను. మంచం మీద పడుక్కుని బలవంతంగా కళ్ళుమూసుకున్నా ఏవో పిచ్చి ఆలోచనలు. ఒక వేళ నిద్ర పట్టినా మగత, అందులో ఏవో లోకాలు. గ్రహాలు, నక్షత్రాలు, చీకటి ,లోయలు, వీటన్నిటి మధ్య ఆర్ణవ్ ,ఆర్ణవ్ మాటలూ ,చూపులూ,అతని మరణం ,మళ్ళీ అగాధాలు ,కలత నిద్ర. మగత నిద్ర. ఎక్కడికో పడిపోతున్నట్లుగా ఉంటోంది. ఉలిక్కి పడి లేస్తున్నాను. ఏదో తెలీని భయం. కళ్ళు తెరవడానికి ఇష్టపడడం లేదు , మెల్లిగా నన్నునేనే పోగొట్టుకుంటున్నాను. నేను ఎక్కడున్నానో తెలీడం లేదు.నన్ను నేను వెతుక్కుంటున్నట్లుగా ఉంది. కళ్ళు తెరిచాక దేని మీద ఉత్సాహం ఉండడం లేదు.

ఓ రోజు నేను కాలేజీనుంచి ఇంటికి వచ్చేసరికి,అమ్మ నాగది లోంచి అప్పుడే బయటికి వస్తోంది.

“ ఏంటీ ,నీ గది ఇంత అసహ్యంగా ఉంది.శుభ్రంగా పెట్టుకోడం అదీ లేదా ! ఇది నీ గదే కదా ,ఎవరో పరాయి వాళ్ళ గది కాదు , నీకు తగిందే ఆ పని మనిషి కూడా. అది అంతే . అలా అలా పైపైనే తుడుస్తోంది. నన్ను నీ గదిలోకి రావద్దంటావు,ఏదీ ముట్టుకో వద్దంటావు. కాస్త సద్దుకో. లేకపోతే నన్ను సద్దమంటే నేను సద్దుతాను ”

“నువ్వు వద్దు , నేనే సద్దుకుంటాలే అని అంటూ గదిలోకి వెళ్ళాను. ఓ సారి గదంతా పరికించి చూసాను. నిజమే ఏం బాగాలేదు. పుస్తకాలూ టేబుల్ అదీ సద్దుకుని చాలా రోజులైంది. తాగేసిన కాఫీ కప్పులు, గ్లాసులు, మంచి నీళ్ళ సీసాలు, హల్దీరాం ఖాళీ పాకెట్లూ, ఎంసెట్ క్వొశ్చెన్ బాంక్ పుస్తకాలూ, మోడల్ పేపర్లూ, క్లాసు పుస్తకాలూ, టేబుల్ మీదా, మంచం పైనా, కిటికీలో అన్నిచోట్లా ఉన్నాయి. పనిమనిషికి చెప్పలేదు కాబట్టి తీయదు. సద్దదు. గదిని ఇంత అసహ్యంగా ఎలా ఉంచుకున్నానో నాకు తెలీడం లేదు, నా మనసు ,బుర్రా ఎలా గజిబిజిగా ఉందో నా గది కూడా అలాగే ఉంది. పైపై వి అన్నీ తీసాను. నా మటుక్కి సద్దాననుకున్నాను.

మర్నాడు సాయంత్రంకాలేజీ నుంచి ఇంటికొచ్చేసరికి చాలా ఆలస్యం అయింది. దాదాపు చీకటి పడింది. నాన్న ఇంటికి వచ్చేసారు. ఇల్లంతా నిశ్శబ్ధంగా ఉంది.

నా కోసమే ఎదురు చూస్తున్నట్లుగా ముందు గదిలోనే అమ్మా నాన్న కూచుని ఉన్నారు. చీకటి పడుతూండగా ,లేటుగా వచ్చానన్న కోపం కావచ్చు. ఆడపిల్ల ఇంకా ఇంటికి రాలేదన్న ఆందోళన కావచ్చు,భయం కావచ్చు. ఏదైనా కానీ వాళ్ళచూపులు నన్ను కలవర పెట్టాయి. ఏదైనా తప్పు చేసానా! వాళ్ళ చూపులు తప్పించుకుంటూ నా గది లోకి వెళ్ళాను. గది నిన్న నేను చేసిన దానికన్నా చాలా బావుంది. అంతా శుభ్రంగా ఉంది. ఈ సారి నుంచి బాగా సద్దుకుంటానని చెప్పాలి.

అమ్మ కోపంగా ఎందుకుంది. చెప్పినా కూడా గదిని అసహ్యంగా ఉంచినందుకా!వాళ్ళతో బలవంతంగా క్లీన్ చేయించినందుకా! కాని నేను అమ్మని గదిని సద్దమని అనలేదు. నేనే చేసుకునే దాన్ని కదా, చేయడం ఎందుకు,కోపంగా ఉండడం ఎందుకు. ఓ కే ఇప్పుడు చేసేసింది కాబట్టి, క్షమించమని అడగాలి. ఇక ముందు ఇలా జరగదు అని అనాలి. మనసులో అలా అనుకుంటూ ముందు గదిలోకి వచ్చాను.

కానీ అమ్మ చేతిలో ఉన్నది చూసాకా నేను మాటలు మరిచిపోయినట్లుగా బొమ్మలా ఉండిపోయాను. కారణం అమ్మ చేతిలో ఉన్న కవర్. అందులో ఓ ఉత్తరం గ్రీటింగ్స్ అదీ ఉంటాయి. అది ఆర్నవ్ నాకు ఆఖరి సారిగా కలసి నప్పుడు నందిని రెస్టారెంటులో ,వెళ్ళిపోతున్నప్పుడు ఇచ్చిన గ్రీటింగ్స్,ఓ చిన్న ఉత్తరం. ఆ గ్రీటింగ్ ని ఉత్తరాన్ని రెస్టారెంటు లోంచి బయటికి రాగానే, వెంటనే చింపలేకపోయాను. ఓసారి చదివితే అని అనుకున్నాను. కానీ ఎందుకో చదవాలనిపించలేదు. ఎవరైనా చూస్తారేమోనన్న భయం అలజడి తో ఇంటికి రాగానే ఏదో ఎదురుగా కనపడ్డ పుస్తకం లో పెట్టేసాను. అంతే . తరవాత దాని గురించి మర్చిపోయాను. ఆరోజున అలా పుస్తకంలో కంగారుగా ఉంచిన ఆ ఉత్తరం గ్రీటింగ్స్, ఇప్పుడు నా ఎదురుగా అమ్మ చేతిలో ఉంది. కడుపులోంచి ఒక్కసారి భయం తన్నుకొచ్చింది. ఏం చెయ్యాలో ఏం అనాలో అర్థం కాక నోరు తెరిచాను. కానీ సమాధానం ఇచ్చేందుకు నాదగ్గర ఏంలేదు. ఉన్నా ఏమీ ఇవ్వదల్చుకోలేదు. ఇచ్చినా ఆమెని కన్విన్స్ చెయ్యలేను. నమ్మించ లేను.

ఆ ఉత్తరాన్ని, గ్రీటింగ్ ని వాళ్ళు చూసేసారు. నిజానికి నేనే వాటిని చూడలేదు. అందులో ఏం రాసాడో తెలీదు. చదవని దాన్ని ఎందుకు ఉంచానో నాకు తెలీదు. అది నాపొరపాటు ,తప్పు ఒప్పుకోడానికి మనసు ఇష్టపడడం లేదు.

ఏదైనా కానీ అది నావి. నేను చదవనిది వాళ్ళు చదివారు. నా ప్రైవేసీ మీద దాడి జరిగింది. ఇలా జరుగుతుందని నేను అనుకోలేదు. ఇది వరకూ చాలా జాగ్రత్తగా ఉండేదాన్ని. ఈమధ్య చాలా నిర్లక్ష్యంగా ఉంటున్నాను. అమ్మా వాళ్ళు ఎందుకు చూస్తారు, వాళ్ళకి నాగదిలో అవసరం ఏం ఉంటుంది , వాళ్ళెందుకు వస్తారు, ఏం చూస్తారు,అయినా చూడడానికి ఏం ఉంది, ఏమీ లేదు,చూడరు అన్న భావంలో ఉన్నాను.

కానీ కాదు. నా అభిప్రాయం తప్పు. వాళ్ళు నా గదిలోకి వచ్చారు,నా రహస్యాలన్నీ తెలుసుకున్నారు, చూసారు. ఇది నా నిర్లక్ష్యానికి ఫలితం. ఓ అబ్బాయి నుంచి ఉత్తరం ఓ అమ్మాయి అందుకోవడం అన్నది వాళ్ల దృష్టిలో పెద్ద నేరం.

ఆ ఉత్తరం ఎన్నో జ్ఞాపకాలని నా ముందుంచింది. చచ్చిపోయే ముందు నాతో అన్న మాటలు, అతని చూపులు,అన్నింటి కన్నా అర్ణవ్ యాక్సిడెంట్. రక్తపు మడుగులో ఆర్ణవ్. నా ముందు కదులుతున్నాయి. నామూలంగా పోయాడు. మనసులో ఏడ్చేసాను.

"ఏఁవిటిదీ? " నాన్న గట్టిగా అరిచారు.

" నువ్వు కాలేజీకి వెళ్తున్నది వీటికోసమా? ఈ మనిషి ఎవరూ? ఈ ఉత్తరం ఏఁవిటీ? ఈ గ్రీటింగ్ ఏఁవిటీ? " కోపంతో అమ్మగొంతు కీచుగా మారింది.

"ఎవరీ మనిషి? ఉత్తరం ఎందుకు రాశాడు? నువ్వు ఏదో అలుసు ఇచ్చి ఉంటావ్. అందుకే రాసాడు. అయినా ఎంత ధైర్యం ఇలా ఉత్తరాలూ అవీ రాయడానికి " నాన్నగొంతు పెంచక పోయినా ,అందులో కాఠిన్యం ఉంది.

ఆర్ణవ్ కింద సంతకం పెట్టలేదా? అందుకే ఆర్ణవ్ పేరు వాళ్ళకి తెలీదు. అందుకే ఎవరీ మనిషి అన్నారు.

ధైర్యమా ! నాకా ! లేకపోతే ఉత్తరం రాసిన ఆర్నవ్ కా! కాదు,ఇద్దరం పిరికివాళ్ళమే.

"నువ్వు కూడా రాసావా? బుద్ధి లేదా రాయడానికి ,ఎన్ని రాసావ్ ? ఇదేనా ! ఇంకా లోపలెక్కడైనా దాచావా? "

నేనేం మాట్లాడలేదు. బాధ,కోపం,విచారం,సిగ్గు,అన్నీ కలిసి కడుపులో సుళ్ళు తిరుగు తున్నాయి. ఆ ఉత్తరం ,ఆ గ్రీటింగ్స్ నా వ్యక్తిగతం. దాన్ని వీళ్ళు ఎందుకు చూడాలి? నన్ను ఎందుకు నిలదీయాలి? ఇలా నిలదీసి అడిగే హక్కు వీళ్ళకుందా? నేను చిన్నపిల్లని కాను. ఒకవేళ చిన్న పిల్లనయితే అది వేరే విషయం. కాని, నేను మేజర్ ని . బీఎస్సీ రెండు సంవత్సరాలు అయిపోయాయి. మూడో సంవత్సరం చదువుతున్నాను. పంతొమ్మిదేళ్ళు నిండుతాయి.

“చెప్పు ఆ ఉత్తరం రాసిన పిల్లాడు ఎవరూ.?” అమ్మ నా మొహంలో మొహం పెట్టి అడిగింది.

ఆ పిల్లాడి పేరు ఆర్నవ్. నా క్లాస్ మేట్ ఫ్రెండ్, సువర్ణ కజిన్ . నేనంటే ప్రాణం పెట్టిన వాడు.నా మూలంగా ప్రాణం తీసుకున్నవాడు. తను.ఓ ప్రేమికుడు.నా స్వార్థం నేను చూసిన దాన్ని. నా మూలంగానేపోయాడు. కాని ఆ విషయాన్ని నేను చెప్పి ఒప్పుకోడానికి ధైర్యం లేకపోయింది. తను ఈ లోకంలో లేడు. చచ్చిపోయాడు. ఓ విధంగా నేనే కారణం. ఇలా ఎన్నో అనుకున్నాను. కానీ నోరు పెగల్లేదు.

“చూడండి రాయిలా ఎలా నిలబడిందో. నాకయితే ఈ చెంపా ఆ చెంపా వాయించాలన్నంత కోపం వచ్చేస్తోంది ” అమ్మ కోపంతో ఊగిపోతోంది. నాన్న అటూ ఇటూ తిరుగుతున్నారు.ఆ అడుగులు కోపంతో పడుతున్నవని తెలుసు. మధ్య మధ్యలో ఆగి అమ్మని నన్ను చూస్తున్నారు.మరోసారి రెట్టించి అమ్మ అడిగింది.

అయినా నేనేం అనలేదు. నా మౌనం వాళ్ళకి ఇంకా అనడానికి అవకాశం ఇస్తోంది. అమ్మ ముందుకి వచ్చింది .ఒక్కసారి నా ఎడమ భుజం పైనా గట్టిగా ఒక్క దెబ్బ వేసింది. అబ్బా! అని అన్నాను. ఆ వెంటనే రెండు చెంపల మీద టపా టపా దెబ్బలు వేసింది. రెండు చేతులతో రెండు చెంపలు నిమురుకుంటూ చూసాను. ఆశ్చర్యం నా కళ్ళల్లోంచి నీళ్ళు రాలేదు.

“జవాబు చెప్పు. ఇది ఎప్పటి ఉత్తరం? ”

అంటే ఆర్ణవ్ తేదీ కూడా వెయ్యలేదన్నమాట

“ ఇది ఇక్కడిదా ? ఇంతకు ముందు మనం ఉన్న ఊరిదా ? అక్కడిదే అయితే ఇక్కడికి ఎందుకు తెచ్చావ్ ? తెచ్చి ఎందుకు దాచావ్? ఈ పిల్లాడు ఇక్కడ ఉంటాడా? మీ ఇద్దరికీ ఏం సంబంధం? అది స్నేహమా ,పెళ్ళి వరకూ వెళ్ళిందా మీ స్నేహం? చేసుకునే ఆలోచన కూడా ఉందా? మీ స్నేహం అంత వరకేనా,ఇంకా ముందుకు వెళ్ళిందా? “ అంటూ అసహ్యంగా మొహం పెట్టింది.

అమ్మ అలా మాట్లాడే సరికి చాలా సిగ్గనిపించింది.

ఒకరి తరవాత మరొకరు , ప్రశ్నలు వేసి వేసి అలసిపోయనట్లుగా ఒక్కసారిగా ఇద్దరూ ఆగారు . నా సమాధానం కోసం , నావైపే చూస్తున్నారు.

వాళ్ళ ప్రశ్నలకి జవాబివ్వాల్సిన పని లేదు. ఎందుకంటే ఆర్నవ్ కి నాకు మధ్య ఉన్న స్నేహాన్ని చెప్పితే అర్థం కాదు. అర్థం చేసుకోరు.ఈ వయసులో మొగ ఆడ మధ్య సహజంగా కలిగే ఆకర్షణ అని కూడా అనుకోరు. పైగా అది సహజం అని కూడా అనుకోరు. ఇప్పుడు ఆ మనిషి లేడన్నసంగతి వీళ్ళకి చెప్పాలి. అప్పుడు కోపం కొంచెం తగ్గుతుంది.

ఎందుకంటే వీళ్ళది మధ్య తరగతి మనస్తత్వం. ఓ మామూలు కుటుంబం నుంచి కష్టపడి పైకొచ్చారు. వాళ్ళ పరిధి అంతే. దాన్ని దాటి ఒక్క ఇంచి కూడా వెళ్ళరు. జీవితంలో ముందుకి వెళ్ళాలంటే ప్రేమ కోరిక, మొగపిల్లలతో స్నేహం ,వయసు, భావోద్వేగం ,ఇలాంటి వాటికి చోటుండకూడదు. ఉండదు. ఎంతసేపూ చదువు మార్కులు ఆ చుట్టూనే వీళ్ళ ప్రపంచం .

" అతను ఈ లోకంలో లేడు " అతి కష్టం మీద అన్నాను.

ఇద్దరూ ఒక్కసారిగా నిశ్శబ్ధం అయిపోయారు. ఆశ్చర్యంగా చూసారు.

ఎలా పోయాడో, ఎందుకు పోయాడో చెప్తే ఈ నిశ్శబ్ధం యిలాగే ఉంటుందా . ఆలోచిస్తున్నాను.

నాన్న అమ్మ వైపు తిరిగి,అమ్మని తిట్టడం మొదలెట్టారు.

. "నువ్వు ,నువ్వే అంతా చేసావ్. అసలు అది ఇలా అవడానికి కారణం నువ్వే. దాన్నిపాడు చేసావ్. ఒక్కగానొక్క కూతురు , మా ఇంటి మహలక్ష్మి అంటూ గారం చేసావ్. నేను ఆఫీసుకి వెళ్ళిపోతాను. నువ్వు కదా ఇంట్లో ఉండేది. కొంచెం స్ట్రిక్ట్ గా ఉండాలని నీకు తోచలేదా? అది ఎవరితో మాట్లాడు తోందో ఎక్కడికి వెళ్తోందో. చూడక్కర్లేదా ? ఇది ఇలా ఉంది కాబట్టే ఎంసెట్ లో మూడు సార్లు రాసినా మంచి రాంక్ రావడం రాలేదు. "

"నేనేం చేసాను? నన్ననకండి .అది ఇంట్లో కన్నా బయటే కదా ఎక్కువ ఉంటోంది. బయట ఏం జరుగుతోందో నాకేం తెలుస్తుంది. స్కూల్లో ఉన్నంత సేపూనేను కనిపెట్టుకుని ఉన్నాను. నాచెప్పుచేతల్లో ఉంది. ఇప్పుడు చెయ్యి దాటిపోయింది. పెద్దైపోయింది కదా మరి నాది సరే, మీరు ఎప్పుడైనా దాన్ని ఏదైనా అడిగారా? ,లేదు.మీరు మీ ఆఫీసు.ఇంటి విషయాలు పట్టించుకున్నారా లేదు. అది అలా అవడానికి కారణం నేనని ఎలా అంటారు? "

ఎప్పటిలాగా వాళ్ళిద్దరూ నా ముందు దెబ్బలాడుకున్నారు. నువ్వు కారణం అంటే నువ్వని గొడవ పడ్డారు. నేను అలాగే గోడకి చేరబడి నుంచున్నాను. కొంచెం సేపటికి వాళ్ళు మామూలైపోయారు ,ఇద్దరూ నావైపు తిరిగారు.

"సరే, ఆ పిల్లాడు పోయాడని అంటున్నావు కదా, అలాంటప్పుడు ఈ ఉత్తరాన్ని ఎందుకు దాచి ఉంచావు ? ఇలా ఉంచినందుకు ఏం జరుగుతుందో నని ఎప్పుడైనా ఆలోచించావా? " మళ్ళీ నాన్న గట్టిగా అన్నారు.

దాన్ని దాచాలని దాచలేదు, అలజడిగా ఉన్న మనసుతో ఇంటికి ,హడావుడిగా వచ్చి,ఎదురుగా ఉన్న పుస్తకంలో ఉంచాను. ఇలాంటిది ఓ రోజున జరుగుతుందని తెలిస్తే అప్పుడే చింపేసే దాన్ని.

కోర్టులో ఓ దోషిని నిలబెట్టి మాట్లాడుతున్నట్లు గా అన్నీ అడుగుతున్నారు.

ఆలోచించలేదన్నట్లుగా తలఊపాను.

"ఇదొక్కటేనా ?ఇంకా ఏదైనా ఉందా.?ఇలాంటి ఉత్తరాలు గ్రీటింగ్ లూ అవీ. మరోటీ మరోటీ. "

లేదు.అన్నట్గా తల అడ్డంగా ఊపాను.

“మరి వీటి మాట ఏంటి..?.”

అప్పుడు చూసాను.అక్కడ ఓ ట్రాన్సపరెంట్ కవర్ లోంచి కనిపిస్తున్నఉత్తరాలు. ఆశ్చర్య పోయాను. కళ్ళు పెద్దగా చేసి చూసాను. అంటే వీళ్ళు వీటిని కూడా చూసారా? తేదీల ప్రకారంగా వరసగా పెట్టినవి. అవి వంశీ రాసినవి, వంశీ నా క్లాస్ మేట్. పదో క్లాసులో నాతో పాటూ చదువుకున్నాడు, క్లాసులో నేను ఎప్పుడూ ఫస్ట్, వంశీ సెకండు. అదే కాదు,కాంపిటీషన్స్ లో కూడా అంతే . బహుమతులన్నీ మా యిద్దరికే. అది మా స్నేహానికి పునాది, స్కూళ్ళల్లో ఆ స్నేహం అంత వరకే ఉంటుంది. పైగా మేము మార్కులు, పరీక్షలు,ప్రిపరేషన్,ఏది ఇంపార్టెంట్, పాత ప్రశ్నా పత్రాలు చూస్తూ ,ఏ డయాగ్రంస్ రిపీట్ అవుతున్నాయి,ఇలా చదువు గురించే మాట్లాడుకునే వాళ్ళం. అంతే.కొంచెం కూడా మా స్నేహం ముందుకి వెళ్ళలేదు. వంశీ వాళ్ల అమ్మా నాన్న వేరే ఊళ్ళో ఉంటారు .అక్కడ చదువు సరిగా లేదు అని అమ్మమ్మ ఇంట్లో ఉండి చదువు కుంటున్నాడు.

పదో క్లాసు అయిపోయాకా వంశీ తన పేరెంట్స్ దగ్గరికి వెళ్ళిపోయాడు. పరీక్షలు అయిపోయాకా స్కూలు వదిలి వెళ్ళే రోజున అందరం ఏడ్చేసాం. బాధగా,విడి పోతూ పోతూ ఒకరి నొకరు ఓదార్చుకుంటూ నవ్వుకుంటూ అందరూ స్నేహితులతో ఆటోగ్రాఫ్ లు తీసుకున్నారు. అడ్రస్సులు తీసుకున్నారు.అలాగే వంశీ కూడా అందరివీ తీసుకున్నాడు. అంతే. అయితే వంశీ ఉత్తరం రాస్తాడని అనుకోలేదు. కానీ రాసాడు. నాకొక్కదానికే కాదు, మరి కొంతమందికి కూడా రాసాడు. ఉత్తరాలు చదువుతూంటే బావుందనిపించింది. జవాబు రాసాను. తను వెళ్ళిన కొత్త చోటు,కొత్త స్కూలు,ఎందుకంటే అక్కడ జూనియర్ కాలేజీ లేదు. సీబిఎస్సీ సిలబస్. లెవెన్త్ ,ట్వెల్త్ ఉన్న స్కూల్లో చేరానని రాసాడు. పన్నెండో క్లాసు అయ్యాకా,ఐఐటీ చెయ్యాలని అనుకుంటున్నానని , దానికి కోచింగ్ తీసుకుంటున్నాని రాసాడు.

నేను కూడా నా ఇంటరు ,క్లాసులు,కొత్త స్నేహాలు ఇలా ఎన్నో రాసాను. రాను రాను స్నేహం ఇంకా కాస్త ముందుకి వెళ్ళింది. ఎన్నో రాసుకున్నాము. టీచర్లు, పాఠాలు, సిలబస్, భవిష్యత్తు,ఆశలూ కలలూ. ఏం చదవాలని అనుకుంటున్నామో. ఇంకా సినిమాలు, పాటలు, పుస్తకాలు,టూరిస్ట్ ప్లేసులు ప్రపంచం లోని వింతలూ. విడ్డూరాలు. ఇలా ఎన్నో, తనకి తెలిసినవి నాకు తెలిసినవి రాసుకునే వాళ్ళం. వంశీ మొగ పిల్లాడు , నేను ఓ ఆడపిల్లని అన్నఊహ అసలు రానే లేదు. మాది స్నేహం,ఎంతో ఉత్సాహాన్నిస్తున్న స్నేహం అదొక్కటే మాకు తెలిసింది. తరవాత వంశీకి ఐఐటీ లో సీటొచ్చింది. చెన్నై వెళ్ళిపోయాడు. నాకు మెడిసిన్ లో సీటు రాలేదు. బిఎస్సీ లో చేరాను. ఇంక ఇప్పుడు రాసుకునే విశేషాలు ఏం లేదు,మా ఇద్దరికీ చదువుల మూలంగా తీరిక దొరకడం లేదు. అందుకని,కొత్త సంవత్సరానికి ,దీపావళికి, పుట్టిన రోజుకి గ్రీటింగ్స్ పంపుకుంటున్నాం. మా మధ్య ఉత్తరాలు తగ్గాయి కానీ మానెయ్యలేదు.ఇప్పుడు ఆ ఉత్తరాలు అవీ,నీట్ గా ఓ ఫైల్లో ఉంచిన ఉత్తరాలు ఇప్పుడు సోఫాలో ఉన్నాయి.

అది కూడా చదివారా ? భయంతో వణికి పోయాను. అమ్మ ఏదేదో అంటోంది.

ఆమె మాటలు గుండెని కోసేసాయి. ప్రతీ పదం ఓ గాజుముక్కలా గుండెని గుచ్చుతోంది, ఆ ముక్కలు చర్మాన్ని చీల్చుకుని బయటికి వచ్చేస్తాయేమో ననిపించింది. లోపల ఏదో తెలీని భయం. ఏదో పెద్ద తప్పు చేసానని అంటూంటే సిగ్గుగా అనిపించింది. గిల్టీగా కూడా అనిపించింది.

“ఇప్పుడు నేను చేయాల్సింది ఒక్కటే.అదే చేస్తాను ” అంటూ నా ముందు నుంచుని తన చెయ్యి చాపింది.

"ఈ ఉత్తరాలూ అవీ ఇంక రాయనని ప్రామిస్ చెయ్యి. అదృష్టం బావుంది కాబట్టి,నీ వ్యవహారం ఇంకా ముందుకి వెళ్ళకుండానే మేము చూడడం జరిగింది. నిన్ను హెచ్చరించడం జరిగింది. మేము నీ పేరెంట్స్. నీ శత్రువులం కాదు. కానీ సమాజానికి భయపడే వాళ్ళం. ఈ ఉత్తరాలూ అవీ నీ వైవాహిక జీవితాన్ని నాశనం చేస్తాయి. అది నీకు తెలీడం లేదు. నీ జీవితం బాగుండాలి. మాకు నీ భవిష్యత్తు ముఖ్యం "

***( కొనసాగింపు వచ్చేనెలలో)***

Post your comments